జాతక మహిమ......అసలు పేరులోనే ఉందికదయ్యా లక్ష్మీకళ.... ఈనాడు నాకు కలిగిన ఆనందం జీవితంలో మరేనాడు కలుగలేదనుకో......"

"........"

"నాలుగేళ్ళుగా నిన్ను చూస్తున్నానుకదా. నెలకిలా వాయిదాలు రూపాయలు ఖర్చు చేస్తుంటే మందలించేవాణ్ణి, నువ్వు అలా వెళ్ళగానే చాలా బాధ పడేవాణ్ణి నీ మనస్సు నొప్పించినందుకు. తాతాపేర్లు అనుకున్నాను కూడా.... 'పాపం మోహనరావుకి లాటరీ తగల కూడదా?' అని. ఇంతకాలానికి భగవంతుడు నా మొర ఆలకించాడు"

"........................"

"నన్ను గురించి మీరందరూ ఏమనుకుంటున్నారో తెలుసు నా విదరమల్లా మీరందరూ నన్ను అపార్థం చేసుకున్నారనే కొంతకాలం క్రితం నేనూ మీలా గుమాస్తానే స్వానుభవంవల్ల మీ కష్టసుఖాలు గ్రహించగలను. ఏదో రోజులు బాగుండి ఈ సంస్థలో ప్రెసిడెంటు నయ్యాను ఫర్ ఎగ్జాంపుల్ ఇవాళ సంఘటన తీసుకో. నువ్వు వేళకి వస్తావని, వళ్ళు వంచి పని చేస్తావనీ నాకు తెలియకకాదు నిన్ను చూడగానే మా ఆనందు గుర్తుకు వస్తాడు కాని వాడితో మాట్లాడినట్లు నీతో మాట్లాడితే ఏం బావుంటుంది చెప్పు? మీరందరూ నా 'ఫామిలీ మెంబర్స్'లా అనిపిస్తారు. అందువల్ల తగని చనువు తీసుకుంటాను అది నా వీక్‌నెస్ నువ్వు అంత దురుసుగా మాట్లాడి లెటర్ ఇచ్చి వెళ్ళావా, నే నెంత బాధ పడ్డానో నీకేం తెలుసు? తర్వాత రామ్మూర్తి చెప్పాడు అసలు సంగతి అప్పటికి నా మనస్సుకు ఉపశమనం కలిగింది మొత్తానికి మోహనరావు. నువ్వు అద్భుతమైన నటుడివయ్యా.. మరొక సంగతి మన 'ఎకౌంటెంట్' మరో వారం ప్రమోషన్‌మీద వెళ్ళిపోతున్నాడు ఆ పోస్టుకి నిన్ను రికమెండ్ చేద్దామనుకుంటున్నాను ఎంత డబ్బున్నా కాలక్షేపం కావద్దుటయ్యా.....

". . . . . "

"ఈ లెటర్ నీ చేత్తోనే చింపెయ్యి......

# సిరివరిస్తే

పోతే నాకు చాలా వ్యథను కలుగజేసిన వాడివవుతావు."

కేవలం ఆయన తృప్తికోసం లెటర్ చింపివేశాడు ఆయన ముఖంలో చిరునవ్వు మెదిలింది.

"అ......మీ ఆలోచనలు ఏవిధంగా సాగుతున్నాయి? ...."

"నే మిద్దరమూ కలిసి నిర్ణయించుకుంటే బాగుంటుందనుకుంటున్నాను. .."

"అదే మంచిది. .....కాబోయే భార్యా భర్తలు కదా.... ...నీ పేరునో, అమ్మాయి పేరునో మన బ్యాంకులోనే 'ఫిక్స్‌డ్ డిపాజిట్'లో వేసుకోవచ్చు. అమ్మాయికి టెలిగ్రాము ఇచ్చావా?—"

"లేదండి. అదొక పల్లెటూరు కావడంవల్ల టెలిగ్రాము ఎన్ని రోజులకు అందుతుందో చెప్పలేము... ..మధ్యాహ్నం ఏదైనా రైల్లో నేనే వెళదామనుకుంటున్నాను"

"సరే బాగానేఉంది .. పది రోజులకు 'లీవు అప్లికేషన్' రాసియ్యి ..కావాలంటే పొడిగించుకోవచ్చు. .."

"అలాగేనండి......"

"అన్నట్లు జరుగుతున్నది నెల ఆఖరివారం కదూ. నీ దగ్గర డబ్బుందో లేదో......వంద రూపాయలకు చెక్కు రాసిస్తాను "

తన సమాధానంకోసం ఎదురు చూడక, చెక్కు రాసి జేబులో పెట్టా రాయన. ఎలా కాదనగలడు? ఆయన ప్రవర్తనలో కొద్ది గంటల వ్యవధిలో ఎంత వ్యత్యాసం పైగా తన ప్రవర్తనను సమర్థించుకుంటున్నారు. వెంటనే ఆఫీసు వదిలి, వీలైనంత తొందరలో రైలెక్కుదామనుకుంటే కృష్ణమూర్తి, రాఘవరావు, రమణమూర్తి, పేరిశాస్త్రి తనని కదలనిస్తేకద! వీళ్ళు నలుగురూ తాను వరించిన అదృష్టాన్ని తలచుకుంటూ మురిసిపోతూంటే వెంకట్రావు తన బుద్ధి మార్చుకోలేకపోయాడు పరాయి వ్యక్తి పేరున కొన్నా టికెట్టయి......ఎవర్ని నమ్మలేము......" అన్నాడు.

వెంకట్రావు శరీరంలో అగుపడకపోయినా నొప్పి తెలుస్తూనే ఉంది. తనను సిరి వరించిందని కుళ్ళు! తన బుద్ధి బయట పెట్టుకున్నాడు కాని వసంత తనకు పరాయి దెలా అవుతుంది? సిరి వరించగానే వసంత తనను చిన్న చూపు చూడాలని వాడి కోరిక! పాపం వసంతను గురించి వాడికి తెలియదు. ముందు ముందు వసంతా, తనూ కలిసి కారులో తిరుగుతూంటే చూడాలి వాడి ముఖం ఎలా ఉంటుందో! తనను ఇవాల్టికి వదిలెయ్యమని వేడుకుంటూంటే కృష్ణమూర్తి అన్నాడు

"మోహనరావు .. అమ్మాయి పేరున కొనమని సలహా ఇచ్చిందెవరు?.. ...." అని

"నువ్వే .."

"అందువల్ల నేను చెప్పినట్లు కనీసం ఇవాల్టికైనా వినాలి నువ్వు "

తను కాదనలేక 'సరే' నన్నాడు.

"మధ్యాహ్నం రైల్లో వెడితే సాయంత్రానికో రాత్రికో చేరుకుంటావు నీరవానరం. బళ్ళు లేక పోతే రాత్రంతా స్టేషన్‌లో జాగారం చెయ్యాలి. అందువల్ల రాత్రి పదకొండు గంటల రైల్లో వెడితే మూడు గంటలకల్లా నీరవానరంలో ఉంటావు. కాస్త తెల్లవారేక బండిలోనో, కాలి నడకనో బయలు దేరవచ్చు ఏడెనిమిది గంటలకల్లా నీ వసంత సాన్నిధ్యంలో ఉంటావు ఇలాంటి సంతోష సమయంలో చిన్న ప్రోగ్రాము వేద్దామనుకుంటున్నాం డబ్బు గురించి బెంగపడకు......ఎలాగో పుట్టిస్తాం."

"ముసలాయన వంద రూపాయలకు చెక్కు రాసిచ్చేరు . .."

"నేను ముందరే అనుకున్నాను.... సాయంత్రం అయిదుగురం కలిసి అయ్యారు హోటల్లో కాఫీ ఫలహారాలు ముగించుకుని, సినిమాకు వెడదాం. తొమ్మిదయ్యేసరికి అయిపోతుంది. తర్వాత హోటల్లో భోజనాలు చేద్దాం ...... స్టేషనుకువచ్చి నిన్ను రైలెక్కించి మేము ఇళ్ళకు వెడతాం..... నువ్వేమంటావు?... ."

తన అంగీకారాన్ని వ్యక్తపరచడంతో వాళ్ళు సంతోషించేరు అందరూ తేలిగ్గా నవ్వుకున్నారు పొద్దుటినుండి 'శుభవార్త వసంతకు ఎప్పుడు చెబుదామా?' అన్న తహతహతోనే గడచిపోయింది. ఎవ్వరిమాటనైనా కాదనగలడుకాని కృష్ణమూర్తి మాటను ఎలా కాదనగలడు? మూడు నెలల క్రితం లాటరీ టికెట్టు కొంటున్నప్పుడు కృష్ణమూర్తి తన ప్రక్కనే ఉన్నాడు కూపన్ పూర్తి చెయ్యబోతూఉంటే,

"మోహనరావు ఒక్క క్షణం ఉండు నీ పేరూ, నా పేరు చెబితే లక్ష్మీదేవి ఆరామడల దూరాన ఉంటుంది " అన్నాడు

"శుభం పలకరా మంకెన్నా అంటే పెళ్ళికూతురు ." అన్నట్లు మూర్తి అపశకునపు మాటలు కోపాన్ని, చిరాకును కల్గించాయి కాస్త ఆలోచించి మూర్తి అన్నాడు :

"నిన్ను అమితంగా ప్రేమిస్తూ, నువ్వే తన సర్వస్వంగా భావిస్తున్న అమ్మాయి ఎవరైనా ఉందా?........" అని



